క్లుప్తంగా

ఘనంగా శ్రీశ్రీ జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఆధునిక కవితకు శ్రీశ్రీ ఆద్యుడని తెలిపారు. శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, మధుసూదన్ బాబు, అధ్యాపకులు నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి, కొండా, తిరుమలేశు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

ప్రొద్దుటూరు : జమ్మలమడుగుకు చెందిన వడ్డే రమణయ్యకు లారీ ప్రమాదంలో కాలుపోయి ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి 'ఏ' పాజిటివ్ రక్తం అవసరమవ్వగా మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్‌ను సంప్రదించగా ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు సభ్యుడు అశోక్ యాదవ్‌చే రక్తదానం చేయించారు. వారి కుటుంబ సభ్యులకు రూ.5,500 ఆర్థిక సహాయం అందించారు. అలాగే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాణి అనే మహిళకు బి. పాజిటివ్ రక్తం తమ ఫౌండేషన్ సభ్యుడు జే.అశోక్ రక్తదానం చేశారని లక్ష్మణరావు తెలిపారు.

సీపీఐ నాయకుల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో ఆదివారం పోలీసుల జులుం నశించాలని సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా వామపక్షాలు వాడవాడలా ప్రచార పోరు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. అయితే కడపలో మాత్రమే పోలీసులు ప్రచార సభలకు అనుమతులు ఇవ్వకుండా దౌర్జన్యంగా లాఠీచార్జి చేశారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యంను పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా పోలీసులు కొట్టారని తెలిపారు. కమ్యూనిస్టులపై జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక 12వ వార్డులోని మహబూబ్ బాషాకు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ సహకారంతో మంజూరైన రూ.40వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ సీఎస్ ఖాజామొహిద్దీన్ అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, షేక్ మునీర్, కింగ్ బాషా పాల్గొన్నారు.

ఉచిత శిక్షణా తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లోని కైవల్య సత్సంగ్ ఎంబీఎస్ ధ్యాన మందిరంలో సోమవారం నుంచి ఉదయం 7.30 నుంచి 9గంటల వరకు ఈ నెల 25వ తేదీ వరకు భగవద్గీతలోని ద్వాదశ అధ్యాయం భక్తి యోగంపై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కైవల్యతీర్థ ఒక ప్రకటనలో తెలిపారు. గత 12 ఏళ్లుగా ప్రతి ఏడాది భగవద్గీతలోని శ్లోకాలు, తెలుగు భాషపై అవగాహన, ధ్యానంపై ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

గోపవరం : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డిలు తెలిపారు. అన్నిశాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. మండల వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా స్పందనలో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

సంక్షేమం ప్రాధాన్యంగా పాలన

బద్వేలు : వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తిమ్మారెడ్డిపల్లె సర్పంచ్ బీరం ఉమా పేర్కొన్నారు. శనివారం రాత్రి ఆమె పోరుమామిళ్ల మండలంలోని తిమ్మారెడ్డిపల్లెలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు పాలనపై వారి అభిప్రాయాలను సేకరించారు. సచివాలయ కన్వీనర్లు గురప్ప, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

బద్వేలు : కడపలోని విద్యాసాగర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం పోరుమామిళ్ల పట్టణంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. దాదాపు 120 మందికిపైగా రోగులకు ఎముకల, కీళ్ల నిపుణులు డాక్టర్ సి విద్యాసాగర్‌రెడ్డి ఉచితంగా పరీక్షలు నిర్వహించి వారికి ఎక్స్‌రేలు తీశారు. అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఘనంగా అమ్మవారి జయంతి



జ్యోతి ఉత్సవాలను నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీమత్కన్యకాపరమేశ్వరి



నగర సంకీర్తన చేస్తున్న ఆర్యవైశ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని నరసింహాపురంలో ఆదివారం జ్యోతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి ప్రారంభమైన జ్యోతి ఉత్సవాలు ఆదివారం ఉదయం వరకు జరిపారు. చౌడేశ్వరిదేవి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి జ్యోతిని తలమీద ఉంచుకుని డప్పువాయిద్యాల సందడికి నృత్యం చేశారు. భక్తులు జ్యోతులు వచ్చేదారిలో కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని శ్రీమత్కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేసి కాయకర్పూరం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కలసపాడు : స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం వాసవిమాత జయంతి వేడుకలు ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహిళలచే సామూహిక లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, భజనలు, గుడి ఉత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆర్య వైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు మలిపెద్దునాగరాజ, బి.కృష్ణయ్య, జె.నారాయణ, టి.సత్యవతమ్మ, జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతకు నగదును అందజేస్తున్న బీరం ఉమా దంపతులు

బద్వేలు : పోరుమామిళ్ల మండలంలోని తోకలపల్లెలో ఆదివారం జరిగిన బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతిని అనంవారిపల్లె జగన్‌మోహన్ రెడ్డి ఎద్దులు గెలుచుకున్నాయి. మొదటి బహుమతి రూ.50వేలను రాయపాటి సుబ్బిరెడ్డి దంపతులు అందజేయగా ఈ నగదును తిమ్మారెడ్డిపల్లె సర్పంచ్ బీరం ఉమా చేతులమీదుగా విజేతకు అందజేశారు. రెండో బహుమతిని బాపట్ల చౌదరి ఎద్దులు, మూడో బహుమతిని కలసపాడు తెల్లపాడుకు చెందిన ఎద్దులు గెలుచుకున్నాయి. విజేతలకు ఆలయకమిటీ అధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

దిరసంచలో బండ లాగుడు పోటీలు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని దిరసవంచ గ్రామంలోని లక్ష్మి చెన్నకేశవ స్వామి 19వ సప్తహా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలను జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన ఎద్లకు మొదటి బహుమతి రూ. 60 వేలను జెడ్పీటీసీ గోవిందరెడ్డి, రెండవ బహుమతి రూ. 30,016 ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మూడవ బహుమతి రూ. 20,016 సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, నాల్గువ బహుమతి రూ. 10,016 బిజివేముల మోహన్‌రెడ్డి, ఐదవ బహుమతి రూ. 5,016 కొండా వెంకటరామిరెడ్డి అందించారు. మొదటి బహుమతి కమలాపురం నియోజకవర్గం జంగంపల్లెకు చెందిన ఎడ్లకు, రెండవ బహుమతి గోపవరం ఎడ్లకు, మూడవ బహుమతి వేముల ఎడ్లకు, నాల్గువ బహుమతి ప్రొద్దుటూరు ఎడ్లు సాధిపంచినట్లు తెలిపారు.

నేడు తోట్లపల్లెలో బండలాగుడు పోటీలు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారు ఆరాధన మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తోట్లపల్లె అచలానంద ఆశ్రమంలో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో విజేత ఎడ్లకు ప్రథమ బహుమతి రూ. 80 వేలు, రెండవ బహుమతి రూ. 60వేలతో పాటు మూడు, నాల్గవ బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాకులు తెలిపారు.

నేటి నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని యూత్ క్రికెట్‌క్లబ్‌లో జిల్లాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మే నెలాఖరు వరకు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు మార్తల సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పెద్దమ్మతల్లికి పూజలు

ప్రొద్దుటూరు : మండలంలోని నంగనూరుపల్లె, ఖాదర్‌బాద్ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆహ్వానం మేరకు ఆదివారం పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవాల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి, ఆయన సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పెద్దమ్మ తల్లికి వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, నంగనూరుపల్లె నాయకుడు యాలం శంకర్, ఎంపీటీసీ క్రిష్టిపాటి సంధ్య మంజునాథ, కొత్తపల్లె మాజీ సర్పంచ్ గురుస్వామి, గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

ప్రొద్దుటూరు : పట్టణంలో మంచానికే పరిమితమైన దివ్యాంగుల ఇంటి వద్దకు వెళ్లి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు ఆదివారం ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ తెలిపారు. దాతలు శ్రీకాంత్ రెడ్డి, ఉమామహేశ్వరి, వారి కుమారుడు జయసింహారెడ్డిల సహకారంతో నిత్యావసర వస్తువులు అందించామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వెంకటసుబ్బయ్య, మాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ నగర్తి సుందరమ్మ భర్త, సర్పంచ్ నగర్తి ప్రసాద్ తండ్రి నగర్తి జేమీస్ (75) శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆదివారం జేమీస్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులు పరామర్శించారు.

నేడు అన్నవరంలో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలో ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలందరూ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కుచ్చుపాప గంగమ్మ సన్నిధిలో ఆర్టీసీ చైర్మన్



గంగమ్మ తల్లి సన్నిధిలో ఆర్టీసీ చైర్మన్ సన్మానిస్తున్న దృశ్యం

చాపాడు : మండలంలోని కుచ్చుపాప గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మ తల్లి సన్నిధిలో ఆదివారం ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ ఆబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్టీసీ చైర్మన్ సమీప బంధువులు గంగమ్మ వద్ద మొక్కు తీర్చుకునే కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ బంధువులతో కలసి గంగమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆర్టీసీ చైర్మన్‌ను ఆలయ మర్యాదలతో సన్మానించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు



లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి



షాట్ పుట్ విసురుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ విభాగంలో స్త్రీ, పురుషులకు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. దాదాపు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్, విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనపరచిన వారు ఈ నెల 5న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. పోటీలను వ్యాయామ అధ్యాపకులు రాఘవేంద్ర, నాగేశ్వరరావు, షఫీ, నాయక్, రవి, శంకర్, ఆర్గనైజర్ అహమర్‌బాషా పర్యవేక్షించారు.

జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివశంకర్



నియామక పత్రం అందుకుంటున్న గుర్రం శివశంకర్

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన గుర్రం శివశంకర్ తిరుపతిలో నిర్వహించిన జాతీయ చేనేత ఐక్యవేదిక కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత, జాతీయ చేనేత ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర చిన్నరెడ్డిబాబు తదితరులు గుర్రం శివశంకర్‌కు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు రాపోలు వీరమోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సగరులకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సగరులకు అన్ని రాజకీయపార్టీలు సీట్లు కేటాయించాలని జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మాదాసు మురళీ పేర్కొన్నారు.

స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం సగరుల ఆత్మీయ సమావేశం, సగరులకు ఉచిత వివాహపరిచయ వేదిక నిర్వహించారు. సెంట్రల్‌స్టీల్ బోర్డు మెంబర్ నాగరాజు మాట్లాడారు. సీఏలో మెరిట్ మార్కులు సాధించిన బండి కేశవనాథ్‌ను శాలువ కప్పి సత్కరించారు. ముందుగా సగరుల కులదైవమైన భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు పంజగల మురళీ, జోడు విశ్వప్రసాద్, పట్నం కవిత, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వెంకయ్య, రామకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతరాలు తొలగించేందుకు కృషి

కడప కార్పొరేషన్: సమాజంలో వేళ్లూనుకొనిపోయిన అంతరాలను తొలగించేందుకు జై భారత్ ఎస్సీ పోరాట వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు తాడవరం వంశీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి గురవయ్యలు సంయుక్తంగా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శంకరాపురంలోని ఈఎస్ఐ ఆసుపత్రి భవనంలో జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ జాతీయ వాదానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జై భారత్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల ఐక్యత, అభ్యున్నతి కోసం జై భారత్ నిరంతరం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.

అనంతరం జై భారత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదికలకు కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ పోరాట వేదిక అధ్యక్షుడిగా ఆర్. ఓబయ్య, ప్రధాన కార్యదర్శిగా రవి, బీసీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షురాలిగా రజియా బేగం ప్రధాన కార్యదర్శిగా నాగమల్లేష్, ఎస్టీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షుడిగా ఎం. శోభానాయక్, ప్రధాన కార్యదర్శిగా బి. కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అన్నదానం



బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా ఆదివారం దాతలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గంగిరెడ్డిపల్లెకు చెందిన అంకిరెడ్డిపల్లె లక్ష్మిరెడ్డి, సుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.చంద్రఓబుళరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

3 నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 3వ తేదీ ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక అభిషేకములు, గణపతి హోమం, 4వ తేదీ పూజా కార్యక్రమాలు, విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, ఉత్సవమూర్తుల గ్రామోత్సవం, అదే రోజు రాత్రి రేలారే రేలా (జబర్దస్త్ టీం) ప్రోగ్రామ్, 5వ తేదీ గణపతిపూజ, స్వామి వారి కల్యాణ మహోత్సవం, చాందిని బండ్లు, ఉత్సవ విగ్రహాలతో స్వామి వారి గ్రామోత్సవం, 6వ తేదీ బండలాగుడు పోటీలు ఉంటాయని, మొదటి బహుమతి రూ.50,116లు, రెండవ బహుమతి రూ.40,116లు, మూడవ బహుమతి రూ.30,116లు, నాల్గవ బహుమతి రూ.20,116లు, ఐదవ బహుమతి రూ.10,116లు, బహుమతులు రాని వృషభాలకు కన్సల్‌టేషన్ బహుమతులు ఉంటాయన్నారు. 7వ తేదీ పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. మూడు రోజుల పాటు వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

వైభవంగా అభయాంజనేయస్వామి తిరునాల



బండలాడుతున్న వృషభాలు

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పక్కన వెలసిన అభయాంజనేయస్వామి తిరునాల గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరునాల సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను అలరించింది. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ10 వేలు అందజేశారు.

చర్చి నిర్మాణానికి భూమి పూజ



చర్చి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : మండలంలోని రామాపురంలో ఆదివారం నూతన చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. ఈ చర్చి నిర్మాణం కోసం పోరెడ్డి సుజాత ఫౌండేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి రూ.50 లక్షలు విలువ చేసే 50 సెంట్లు స్థలం ఉచితంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాపురం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, పోరెడ్డి సుజాత ఫౌండేషన్ అధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీస్ కంప్లెంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, రామాపురం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు యాకోబ్, చర్చి పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లుకు సన్మానం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని ఆదివారం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లీగల్ అడ్వైజర్ అద్దంకి సుదర్శన్ పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. మున్సిపల్ స్టాండింగ్ లీగల్ అడ్వైజర్ పదవిలో నియమించినందుకు ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, నంగనూరుపల్లె వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి యాలం శంకర్, సోములవారిపల్లె మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ కంప్లైంట్ అథారిటీతో బాధితులకు న్యాయం



కాకర్ల నాగశేషారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు పోలీస్‌స్టేషన్లలో అన్యాయం జరిగితే బాధితుల పక్షాన పోరాడి వారికి న్యాయం చేసేందుకే ప్రభుత్వం పోలీస్ కంప్లైంట్ అథారిటీని నియమించిందని రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని నాలుగో వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం కాకర్ల నాగేశారెడ్డికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. వరికూటి ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కాకర్ల మాట్లాడుతూ పోలీస్ కంప్లైంట్ అథారిటీకి సంబంధించి రాష్ట్ర స్థాయిలో రిటైర్డు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉన్నారని తెలిపారు. కింది స్థాయిలో ప్రాంతాల వారిగా ఏర్పాటు చేసిన ఈ అథారిటీలో రాయలసీమకు సంబంధించి తాను నియమితుడయ్యానని తెలిపారు. వరికూటి ఓబుళరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పదవులు వరిస్తున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ కాకర్ల నాగేశారెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి, శౌరి సుభాష్‌రెడ్డితోపాటు తాను చాలా ఏళ్ల క్రితమే కౌన్సిలర్లుగా ఎన్నికయ్యామని, మిత్రులుగా ఉన్నామని తెలిపారు. నాగేశారెడ్డికి పదవి రావడం పట్ల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేకే, రమణారెడ్డి, పుల్లారెడ్డి, పగిడాల దస్తగిరితోపాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురువు చేయలేని పనిని శిష్యుడు చేశాడు

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చేయలేని నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని ఆయన శిష్యుడైన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి చేశాడని వైఎస్సార్‌సీపీ నాలుగో వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి రెండు రోజుల క్రితం స్వయంగా వెళ్లి పరిశీలించారన్నారు. వాస్తవానికి ప్రజల అవసరాల దృష్ట్యా ఎప్పటి నుంచో కూరగాయల మార్కెట్‌ను నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే భావించారన్నారు. అయితే ఆయన ఎమ్మెల్యేగా ఉన్న పాతికేళ్ల సమయంలో చేపట్టలేకపోయారన్నారు. ప్రస్తుతం కూరగాయల మార్కెట్ నిర్మాణంతోపాటు రూ.520 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే అమృత్ పథకం మంజూరైన అప్పటి పాలకులు నిర్మించలేకపోయారన్నారు. రెండోమారు ఎమ్మెల్యేగా ఎన్నికైన రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రత్యేక దృష్టితో మున్సిపాలిటీ ద్వారా నిధులు మంజూరు చేయించి అమృత్ పథకాన్ని పూర్తి చేశారన్నారు. తన శిష్యుడైన రాచమల్లును గురువు అయిన వరదరాజులరెడ్డి నిజంగా అభినందించాల్సి ఉందన్నారు.

మహిళల అభ్యున్నతే ధ్యేయం



బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్: మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో మెప్మా, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, లైవ్లీహుడ్ మిషన్ సహకారంతో ఎస్ఎస్ సొల్యూషన్స్ ట్రైనింగ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. నామినేటెడ్ పదవులు, పనుల్లోనేగాక, ప్రతి రంగంలోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని తెలిపారు. ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతోనే ఇస్తున్నారన్నారు. మహిళలు స్వయంగా అభివృద్ధి చెందడానికి వారికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. ఎస్ఎస్ సొల్యూషన్స్ ద్వారా 52 మంది శిక్షణ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సర్టిఫికెట్లు పొందిన మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించి, వారికి స్వయం ఉపాధి కల్పించాలని, కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి మెరుగైన ఉద్యోగాలు కల్పించాలని మంత్రి మెప్మా అధికారులకు సూచించారు. మెప్మా ఎండీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్, బ్యూటీషియన్ కిట్ అందివ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా స్టేట్ మిషన్ మేనేజర్ ఆదినారాయణ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డి. సురేష్ రెడ్డి, డీపీఎం టి. నాగరాజు, ఎస్ఎస్ సొల్యూషన్స్ ఎండీ బి. శృతి పాల్గొన్నారు.